క్లుప్తంగా

శిశువులకు, తల్లులకు పౌష్టికాహారం అందించాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): శిశువులు, తల్లులకు మెరుగైన పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ ఈలప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ జి.రమాదేవి అన్నారు. ఈలప్రోలు సెక్టార్ పరిధిలోని 24 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. కొండపల్లి డంపింగ్ యార్డ్ వద్ద పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని పోషణ్ పక్వాడాలో వెయ్యి రోజుల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలు కలిగిన ఇళ్లల్లో పురుషులు ఇంటి పనుల్లో సహాయం చేయాలని చెప్పారు. ఆరు నెలలు నిండిన తర్వాత శిశువుకు సురక్షితమైన మోతాదులో కాంప్లిమెంటరీ ఆహారం అందించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల కుమారి, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

మారెమ్మ అమ్మవారి తిరునాళ్ల ప్రారంభం

విస్సన్నపేట: పుత్రేలలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో తిరునాళ్ల మహోత్సవం శనివారం ప్రారంభమైంది. అంకురార్పణ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన, నవగ్రహ పూజ, మారెమ్మ తల్లికి గుడారు వేయటం, తంబల సేవ, అమ్మవారి కథాగానం, బొడ్డురాయి కట్టే కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం అమ్మవారి రథోత్సవం, గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ఈఓ వి. దుర్గా ధనప్రసాద్ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



చాట్రాయి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలతో ముందుకు సాగాలని రాష్ట్ర క్రియేటివ్ కల్చర్ కమిషన్ సీఈఓ రేగుళ్ల మల్లికార్జునరావు అన్నారు. స్థానిక దళితవాడలో పునర్నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమత సైనిక్‌దళ్ అధ్యక్షుడు, హైకోర్టు అడ్వకేట్ పాలేటి మహేష్ (పింకి), బర్మా ఫణిబాబు, మందపాటి బసవారెడ్డి, నక్కా రాము, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆర్కే కళాశాల ప్రిన్సిపాల్ కె. రామకృష్ణయ్య అన్నారు. కేతకొండ ఆర్కే కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన అడ్వాన్స్ ట్రెండ్ ఇన్ ఇంజినీరింగ్ సైన్స్, టెక్నాలజీ (అటెస్ట్ 2కె25) సదస్సు శనివారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ నానో టెక్నాలజీ, రెన్యూవల్ ఎనర్జీ గురించి ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకోవాలన్నారు. ఇప్పుడున్న సాంకేతిక వేగాన్ని అందుకోవడం ఒక్కరి వల్ల సాధ్యం కాదని, సమిష్టి కృషితోనే సాధ్యమవుతుందన్నారు. ఈ అంశాలపై కరపత్రాలు ఆవిష్కరించారు. వివిధ కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రోగ్రాం కన్వీనర్ కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టాపర్లకు అభినందన

మైలవరం: ఇంటర్ ఫలితాల్లో మైలవరం విద్యార్థి జేఎంవీఎస్ దుర్గా మహేష్ ప్రతిభ కనబర్చి 1000కి 987 మార్కులతో మండలంలో మొదటి స్థానంలో నిలిచాడు. మహేష్ తండ్రి వెంకట మురళీ మోహన్, తల్లి హేమలతలు మైలవరం గ్రామంలో బుట్టల వ్యాపారం చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. మహేష్ మైలవరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివాడు. వేముల సుస్మిత మండలంలో ద్వితీయ స్థానం, బింగి హరిప్రియ తృతీయ స్థానం సాధించారు. విద్యార్థులను మైలవరం జమీందారు తనయుడు ఎస్వీఎస్ నివృతరావు అభినందించారు.

వలస బాట

- ఉపాధి హామీ పనుల కల్పన లేక వలస పోతున్న గ్రామస్తులు
- ఫీల్డ్ అసిస్టెంట్‌ను వేధించి సస్పెండ్ చేయించిన టీడీపీ నాయకుడు
- పొట్టకూటి కోసం పొరుగు గ్రామాలకు వలస



గణవపరం గ్రామం నుంచి పనుల కోసం వలస పోతున్న గ్రామస్తులు

జి.కొండూరు: టీడీపీ నాయకుడి వేధింపులు ఆ గ్రామ ప్రజల పాలిట శాపంగా మారాయి. రాజకీయ వివక్షతతో 17 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దివ్యాంగుడిని తొలగించేందుకు కుట్ర పన్ని వేధించాడు. తనని ఉద్యోగం నుంచి తొలగిస్తే కుటుంబం రోడ్డున పడుతుందని ఆ ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం చేశాడు. అయినా కనికరించని టీడీపీ నాయకుడు అవినీతి ఆరోపణలు చేయించి సస్పెండ్ చేయించాడు. తన అనుకూలురు ఇద్దరిని ఒకరి తర్వాత ఒకరిని నియమించాడు. ఆ ఇద్దరు తప్పుకోవడంతో ఆ గ్రామంలో ఉపాధి పనులు నిలిచిపోయాయి. ఫీల్డ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ ఎత్తివేయకుండా ఆ టీడీపీ నాయకుడు అడ్డుపడుతున్నాడు. ఫలితంగా పొట్టకూటి కోసం గ్రామస్తులు పొరుగు గ్రామాలకు పరుగులు తీస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండల పరిధి గణపవరం గ్రామంలో ఉపాధి కోసం వలస పోతున్న గ్రామస్తులను చూస్తే రాజకీయ వివక్ష ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

300 మంది వరకు వలస

మైలవరం మండల పరిధి గణపవరం గ్రామంలో 3,723 మంది జనాభా ఉండగా ఉపాధి హామీ జాబ్ కార్డులు 957 వరకు ఉన్నాయి. వీరిలో రెగ్యులర్‌గా 650 మంది వరకు ఉపాధి హామీ పనులకు వెళ్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ గ్రామంలో గత 17 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దివ్యాంగుడు టి.గంగరాజుని వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడనే నెపంతో ఉద్యోగం నుంచి తొలగించేందుకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కుట్ర పన్ని వేధించాడు. ఈ క్రమంలో గత ఏడాది జులై 22న గంగరాజు ఆత్మహత్యాయత్నం కూడా చేశాడు. అయినప్పటికీ కనికరించని టీడీపీ నాయకుడు ఎమ్మెల్యే మాటని సైతం లెక్కచేయకుండా గంగరాజుపై అవినీతి ఆరోపణలు చేయించి సెప్టెంబరు 17న సస్పెండ్ చేయించాడు. ఆ తర్వాత తన అనుకూలురు ఇద్దరిని నియమించినప్పటికీ ఒకరి తర్వాత ఒకరు విధుల నుంచి తప్పుకున్నారు. ఈ క్రమంలో ఆ గ్రామంలో ఉపాధి పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నప్పటికీ గణపవరం గ్రామంలో పనులు లేక పోవడంతో గ్రామస్తులు 300 మంది వరకు పొరుగు గ్రామాలకు పనుల కోసం వలస పోతున్నారు. నూజివీడు, ఆగిరిపల్లి, ఈదర, గుడివాడ వరకు వెళ్లి వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. చిన్నారులను, వృద్ధులను వదిలేసి పొరుగు గ్రామం పోవడం తమకు ఇబ్బందిగా ఉందని, గ్రామంలోనే పనులు కల్పించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి పనులు లేక వలస



గ్రామంలో ఉపాధి పనులు లేక పొరుగు గ్రామాలకు పనుల కోసం వలస పోతున్నాం. ఇతర గ్రామాల్లో ఉపాధి పనులు ఇస్తున్నప్పటికీ మా గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభం కాలేదు. పిల్లలను వదిలి పెట్టి పొరుగు గ్రామాలకు జీవనోపాధి కోసం పోవాల్సి వస్తోంది. అధికారులు కూడా స్పందించడం లేదు.

– దాసరి శ్రీనివాసరావు, గణపవరం

ఉపాధి పనులు ప్రారంభించాలి



పిల్లలను ఇంటి వద్ద వృద్ధులకు అప్పగించి ఉపాధి కోసం వేరే ఊరు పోవాల్సి వస్తోంది. గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తే మధ్యాహ్నం కల్లా ఇంటికి వచ్చేస్తాం. పొరుగు గ్రామాలకు పనుల కోసం పోతే సాయంత్రం వరకు రాలేకపోతున్నాం. నరకయాతన పడుతున్నాం.

– కొసనం కృష్ణ, ఉపాధి కూలీ, గణపవరం

పనులు ప్రారంభిస్తాం



గణపవరం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రికవరీ ఉన్నందున సస్పెన్షన్‌లో ఉన్నారు. మేట్‌లతో మాట్లాడి సోమవారం నుంచి గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడతాం. క్రమం తప్పకుండా పనులు జరిగేలా చూస్తాం.

– అనూరాధ, ఎంపీడీఓ, మైలవరం

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన



పైడూరుపాడులో ధాన్యం రాశి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పైడూరుపాడు(విజయవాడరూరల్): కూటమి ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం పైడూరుపాడు గ్రామంలో రంగినేని నాగేశ్వరరావు, కాగితపు వెంకటేశ్వరరావు, జూల పల్లి వెంకటేశ్వరరావు, పెయ్యల వెంకటేశ్వరరావు పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం రాసుల వద్ద రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంయుక్తంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి వేమూరి సీతారామయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని చెప్పడమే తప్ప ఈ ప్రాంతంలో ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని పాలకులు గ్రామాల్లో ప్రచారం చేయడమే తప్ప చర్యలు శూన్యమని చెప్పారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రైతులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి రోడ్లపై సంచరిస్తే కఠిన చర్యలు

సీఐ పి.సత్య శ్రీనివాస్ హెచ్చరిక

నూజివీడు: పట్టణంలో ఏ పనీ లేకుండా అర్ధరాత్రి సమయంలో రోడ్లపై సంచరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పి.సత్య శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలో సంచరిస్తున్న పలువురుని అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ పిల్లలు ఎక్కడెక్కడ తిరుగుతున్నారు, ఏం పనులు చేస్తున్నారో నిరంతరం తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందన్నారు. అర్ధరాత్రి వరకు ఇంటికి రాని పిల్లలను నిలదీయాలని సూచించారు. పిల్లలు సక్రమ మార్గంలో ఉండేలా చూసుకోవాలని సూచించారు.

శ్రీనిధి స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే



తిరువూరు: స్థానిక శ్రీనిధి స్కూల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రీ ప్రైమరీ తరగతి నుంచి ప్రైమరీకి వెళ్లే విద్యార్థులకు ఎంఈఓ శ్యాం సుందర్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రాథమిక స్థాయిలో పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసే విధానాన్ని ఆయన వివరించారు. బాలబాలికలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పాఠశాల చైర్మన్ సురేష్‌బాబు, కరస్పాండెంటు కిశోర్‌బాబు, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

525 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు విద్యార్థులకు, సెక్యూరిటీ, హౌస్ కీపింగ్, బోధనా సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఉచిత వైద్యసేవలు అందిస్తున్న శ్రీకర హాస్పటల్స్ యాజమాన్యానికి డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. గుండె, లివర్, జనరల్ మెడిసిన్, చర్మ, దంత, గైనకాలజీ విభాగాల వైద్యులు శిబిరంలో మొత్తం 525 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఏఓ బి.లక్ష్మణరావు, వైద్యులు, ట్రిపుల్ ఐటీ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు



భూక్యా హరిణి | పఠాన్ షాజిదా ఖాతూన్ | టి.లీనా బలరామిని

మైలవరం: ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మైలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల బాలికల హైస్కూల్ ప్లస్ టూ విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని ప్రిన్సిపాల్ పి. లక్ష్మి శనివారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 294 హైస్కూల్ ప్లస్ టూ ఉండగా మైలవరం జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 14 మంది విద్యార్థినులకు గాను 14 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పి.మాధవి 888, ఎల్. శ్రావణి 846 మార్కులు సాధించారన్నారు. సీనియర్ బైపీసీలో 38 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. భూక్యా హరిణి 1000 మార్కులకు గాను 978 మార్కులు, పఠాన్ సాజిదా ఖాతూన్ 976 మార్కులు, రాష్ట్ర స్థాయి హైస్కూల్ ప్లస్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. ఒకేషనల్ విభాగంలో నూరు శాతం ఫలితాలు సాధించామని వివరించారు.

ఘనంగా క్రాంతి హైస్కూల్ కాన్వొకేషన్



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి, కవులూరు గ్రామాల్లోని క్రాంతి పాఠశాలల కిండర్ గార్డెన్ విద్యార్థుల కాన్వొకేషన్ కార్యక్రమం కొండపల్లి క్రాంతి పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బాలబాలికలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం వెనిగళ్ల అమ్మాజీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు: స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు శనివారం తెలిపారు. సీనియర్ ఎంపీసీలో 1000 మార్కులకు పి.ఆకాంక్ష 989, మేఘన 988, సీఈసీలో పి.వెంకన్నబాబు 965 సాధించారని పేర్కొన్నారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు జి.పూజిత 465, పి.సమన్విత, ఆర్ సాయితేజ 464, బైపీసీలో 440 మార్కులకు బి.సాత్రిక 427, బి.లక్ష్మీపూజిత 426 మార్కులు సాధించారని వివరించారు.

జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

బాలికల హైస్కూల్ ప్లస్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగబాబు శనివారం తెలిపారు. సీనియర్ బైపీసీలో 19 మందికి 10 మంది, ఎంపీసీలో నలుగురికి ముగ్గురు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 44 శాతం ఉత్తీర్ణులయ్యారని చెప్పారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్లో శనివారం అధికారులు సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి వద్ద సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి సారా తయారీదారులు బాణావతు రవిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. తాతకుంట్లలో వడిత్య సక్రు వద్ద లీటరు సారా స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్‌కు మేజిస్ట్రేట్ ఆదేశించారన్నారు. తిరువూరు మండలం ఆంజనేయపురంలో బజ్జూరి ధనలక్ష్మి వద్ద ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. ఎ.కొండూరు మండలం కుమ్మరకుంట్లలో సారా కేసులో పాత నేరస్తుడు భూక్యా చినబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

మెరిసిన శ్రీ శారద విద్యార్థులు

నూజివీడు: స్థానిక శ్రీ శారద జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల డైరెక్టర్ కుప్పాల శంకరరావు తెలిపారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో 1000 మార్కులకుగాను కుప్పాల దేదీప్యసాయి 991, ఎస్. హేమశ్రీ 981, పి.హరిప్రియ 976, సీనియర్ ఎంపీసీలో బి.కోమలీశ్రీజ 985, పి.పూర్ణిమ 983, ఎస్ వాసవి, ఒ.చరితలు 978 మార్కులు సాధించారని చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో 470 మార్కులకు ఎస్ వర్షిత, టి. మౌనికలు 465, వై.తన్మయి 464, పి.సాహితీ ప్రియాంక 463, బి.మహేశ్వరీబాయ్ 462, పి.సాత్విక 461, యు.గాయత్రి 460, బైపీసీలో 440 మార్కులకు పి.లలిత్యా 431, ఎస్. హాసిని 428, ఆర్. సిరివల్లి 425, ఆర్. రాజేష్ శ్రీవల్లి 424, ఎస్. చాతుర్య 423 మార్కులు సాధించారని వివరించారు.

వికాస్‌లో ద్వితీయ ఇంటర్ 91 శాతం ఉత్తీర్ణత



సాయికిరణ్



ఉషారాణి

చాట్రాయి: ఇంటర్ ఫలితాల్లో చాట్రాయి వికాస్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 82 శాతం, ద్వితీయ సంవత్సరంలో 91 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో వి.నంద కిశోర్ 470కి 458, సాయి కిరణ్ 1000కి 962, బైపీసీలో ఉషారాణి 957 మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను విస్సన్నపేట వికాస్ విద్యా సంస్థల చైర్మన్ ఎస్. నర్సిరెడ్డి, చాట్రాయి వికాస్ కాలేజీ ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



ముసునూరు: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిల్లబోయినపల్లిలో సారా శిబిరాలపై శనివారం దాడి చేశామని నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. మిడత శ్రీనుకు చెందిన సారా బట్టీ వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వసం చేశామన్నారు. శ్రీనుపై కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో నూజివీడు ఎక్సైజ్ ఎస్‌ఐలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

జి.కొండూరు: కవులూరు ధన్వంతరి చారిటబుల్ ట్రస్టు భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ట్రస్టు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, సాధారణ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని చెప్పారు.

ఇంటర్‌లో సత్తా చాటిన గురుకులం



ఎ: పి.శ్రీలత (439)



జి.వనిత (945)

జి.కొండూరు: ఇంటర్ ఫలితాల్లో కుంటముక్కల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల సత్తా చాటింది. జూనియర్ ఇంటర్‌లో 79 మందికి గానూ 73 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించగా ఎంపీసీలో పి.శ్రీలత 439 మార్కులు, బైపీసీలో ఎం. పూజిత 417మార్కులను సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. సీనియర్ ఇంటర్‌లో 76 మందికి గానూ 75 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో జి.అర్చన 933 మార్కులు, బైపీసీలో జి.వనిత 941మార్కులను సాధించారు. విద్యార్థినులను పలువురు అభినందించారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ఉత్తమ ఫలితాలు



వీరంకి లావణ్య (971)

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి, ఈదరకు చెందిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 68 శాతం, ద్వితీయ సంవత్సరంలో 98 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ యోహాను తెలిపారు. ఈదర జెడ్పీ హైస్కూల్‌లోని జూనియర్ కళాశాల విద్యార్థులు మొదటి సంవత్సరం 82 శాతం, ద్వితీయ సంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయిని శారద తెలిపారు. ఆగిరిపల్లి కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని వీరంకి లావణ్య వెయ్యి మార్కులకు 971 మార్కులు సాధించిందని చెప్పారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన బాలికలు

తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని ఇంటర్మీడియెట్ విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించారని ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో 100 శాతం, బైపీసీ విభాగంలో 73 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఎంపీసీలో కొల్లి శ్రీలేఖ 1000 మార్కులకు 893, నిడిగొండ త్రివేణి 738, జి. మహిత 719 మార్కులు సాధించారని చెప్పారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎన్. లావణ్య 470 మార్కులకు 422, పి. సుస్మిత 419 మార్కులు సాధించారన్నారు. తిరువూరు నాగార్జున కళాశాల ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపు విద్యార్థినులు నారాయణపురపు దుర్గాంజలి 991, గర్నేపూడి భాగ్యలక్ష్మి 990 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ శేషగిరిరావు తెలిపారు. తిరువూరు శ్రీనిధి స్కూల్లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు షేక్ నీలోఫర్ 989, ఎ. కార్తీక్ 988 మార్కులు, బైపీసీలో డి. ప్రియ హన్సిక 981, బి.యామిని 976 మార్కులు సాధించారని చెప్పారు.

మడుపల్లి తాతయ్య విద్యార్థులకు ఉత్తమ మార్కులు



తెర్లి స్వర్ణ

నూజివీడు: స్థానిక మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి అత్యుత్తమ మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. జూనియర్ బైపీసీలో తెర్లి స్వర్ణ 440 మార్కులకు 433 సాధించి డివిజన్, ఏలూరు జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఎంపీసీలో పీవీ నాగలక్ష్మి 470కు 454 మార్కులు సాధించి ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ద్వితీయ సంవత్సరంలో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరిచారని వివరించారు.

పెదకొమెర కేజీబీవీలో 81శాతం ఉత్తీర్ణత

తిరువూరు: గంపలగూడెం మండలం పెదకొమెర కేజీబీవీ పాఠశాలలో ప్రథమ ఇంటర్మీడియెట్ పరీక్షల్లో 81 శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ మోక్షగుండం వెంకటలక్ష్మి తెలిపారు. 36 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరవగా 29 మంది ఉత్తీర్ణులయ్యారని, నునావతు గాయత్రి 436 మార్కులు సాధించిందని చెప్పారు. ద్వితీయ ఇంటర్ పరీక్షల్లో 84 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారని, 32 మంది ఈ పరీక్షలు రాయగా 27 మంది ఉత్తీర్ణులయ్యారని, కొలకలూరి శాంతి 884 మార్కులు సాధించిందన్నారు.

ప్రతిభ చాటిన అక్కాచెల్లెళ్లు



నెమలికంటి కల్యాణి (944)



నెమలికంటి శ్రావణి (912)

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ పాఠశాల ప్లస్‌లో చదివిన అక్కాచెల్లెళ్లు శనివారం ప్రకటించిన ఇంటర్ మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ ఫలితాల్లో నెమలికంటి కల్యాణి 944/1000 మార్కులు, సీఈసీలో నెమలికంటి శ్రావణి 912/1000 మార్కులు సాధించి ఆయా విభాగాల్లో మండల స్థాయి ప్రథమ స్థానాల్లో నిలిచారని హెచ్‌ఎం పద్మలత తెలిపారు. కుసుమనాగ అంజలి 877, ఆర్. మణితేజ 865, జూనియర్ ఇంటర్‌లో ఎం.కీర్తన 440, ఐశ్వర్య 416 మార్కులు సాధించారని వివరించారు.

కేజీబీవీ విద్యార్థుల విజయకేతనం

రెడ్డిగూడెం(జి.కొండూరు): ఇంటర్ ఫలితాల్లో రెడ్డిగూడెం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విజయకేతనం ఎగురవేసింది. ప్రథమ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో 40 మంది విద్యార్థినులకు గానూ 39 మంది ఉత్తీర్ణత సాధించారు. జి.నిఖిత 422, పల్లెపాము నిత్యశ్రీ 398, గరికపాటి చామంతి 395 మార్కులను సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 39 మందికి గానూ 38 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు.కేవీఎస్ తిరుమలాదేవి 956, లక్కనబోయిన నాగలక్ష్మి 948, కొక్కిలిగడ్డ వర్షిత 943 మార్కులను సాధించారు.

మైలవరం వీవీఆర్ కళాశాల విద్యార్థుల హవా

మైలవరం: ఇంటర్ మీడియెట్ పబ్లిక్ పరీక్ష ఫలితాలలో మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ సొంగా సరళకుమారి శనివారం తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 54 శాతం, ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 77 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఒకేషనల్ విభాగంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో నూరు శాతం ఫలితాలు సాధించారని చెప్పారు. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో ఎంపీసీ జె.ప్రసన్న 457/470, ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో పి.. ఉదయశ్రీ 480/500, ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో (సీఈసీ)ఎం. పావని 954/1000, ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో టి. సాయిరాణి 956 /1000 మార్కులు సాధించారని వివరించారు.